క్లుప్తంగా

హోమియో వైద్య శిబిరం

రంగంపేట: వైద్యులు సూచించిన విధంగా మందులు వాడి ఆరోగ్యవంతులుగా తయారు కావాలని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్నాథ్ సూచించారు. మండలంలోని కోటపాడు గ్రామంలో సత్యసాయి సేవా సదన్‌లో నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ప్రారంభించి అనంతరం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ శ్యామ్‌కుమార్ వైష్ణవ్ సుమారు 50 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు.

ఘనంగా ఐక్య గ్రాండ్ క్రిస్మస్

గోకవరం: నియోజకవర్గ ఐక్య గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి గోకవరంలో ఘనంగా జరిగాయి. జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ హాలోనెస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, రాష్ట్ర పెంతెకోస్తు అధ్యక్షుడు జాన్ లాజరస్, స్టేట్ సెక్రటరీ మర్రి డానియల్, ఏపీ ఏఐసీసీ అధ్యక్షుడు రైమో జుహానీ హాలోనెన్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని సరిపల్లిపేటలో ఉన్న అవతార్ మెహర్ బాబా ఆలయ నాలుగో వార్షికోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయం కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి భజనలు, పూజలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్తీక వన సమారాధన

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడత మామిడి వద్ద ఘనంగా వన సమారాధన నిర్వహించారు. కార్తిక మాసం నాలుగో సోమవారం కావడంతో శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ వన సమారాధన నిర్వహించారు. ఆలయం కమిటీ అధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండ అగ్రహారం వీధిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆ సంఘం మండల నాయకుడు బొండాడ చందు తెలిపారు.

లక్ష బిల్వార్చన

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని శ్రీ గౌరి శంకర ఆలయం వద్ద అర్చకులు గరిమెళ్ళ గాంధీ ఆధ్వర్యంలో 12 మంది రుత్వికులతో సోమవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన, దీపాలంకరణ చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. కొంకుదురు శ్రీ త్రిముఖలింగేశ్వరస్వామికి, బిక్కవోలు గోలింగేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన చేశారు.

స్పందనకు ఐదు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఐదు అర్జీలు అందాయి. ముగ్గళ్లలోని 337, 338, 339 సర్వే నెంబరు గల భూమిని 1977లో 22 మంది దళితులకు డి పట్టాలు, పట్టాదారు పాస్‌బుక్‌లు అందించారని, రీసర్వేకు వీఆర్వో, సర్వేయర్‌లు భూమికి సంబంధించి రికార్డులు లేవంటున్నారని, దానిపై విచారించి న్యాయం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకట రమణ రెండు అర్జీలు అందించారు. ఇంటి స్థలం ఆక్రమణ, కట్నం వేధింపులు, భూమి సమస్యలపై మరో మూడు ఫిర్యాదులు వచ్చాయి.

18 నుంచి షష్ఠి ఉత్సవాలు

మధురపూడి: కోరుకొండలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్ఠి మహోత్సవాలు ఈనెల 18 నుంచి 23 వరకూ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఉల్లి బుజ్జిబాబు, సెక్రటరీ ఒంటిపల్లి సత్యనారాయణ, ట్రెజరర్ కటకం సత్యనారాయణ, సభ్యులు నీరుకొండ బాబ్జి, తాడి హరిశ్చంద్ర ప్రసాద్‌రెడ్డి, పసుపులేటి అబ్బులు, కటకం చలం ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. 18వ తేదీ రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు.

సారా కేసులో ముగ్గురి అరెస్టు

మధురపూడి: కోరుకొండ సెబ్ పోలీసు స్టేషన్ పరిధిలో సారా విక్రయిస్తున్న ముగ్గురిని సోమవారం అరెస్టు చేశారు. సెబ్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో కణుపూరు, నర్సాపురం గ్రామాల్లో దాడులు నిర్వహించి, 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కణుపూరుకు చెందిన ఉప్పలపాటి సత్తిబాబు, నర్సాపురానికి చెందిన దుంగల రామకృష్ణ, గాదరాడకు చెందిన పంపన వీరబాబును రిమాండ్‌కు తరలించారు. దాడిలో ఎస్సై టి.నిరంజన్, సిబ్బంది పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన పలివేల శ్రీనుబాబు 10 లీటర్లు సారా విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు రంగంపేట స్పెషల్ ఎన్ ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్సై కె.శేఖర్‌బాబు తెలిపారు.

అటవీ సిబ్బందికి శిక్షణ

రాజానగరం: స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లకు మూడు నెలలు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లకు ఆరు నెలలుగా శిక్షణా కాల వ్యవధిలో మార్పులు చేశామని అకాడమీ డైరెక్టర్ పీవీవీ ఉదయ్ భాస్కర్ తెలిపారు. పైకేటగిరీలలోని అటవీ సిబ్బంది నూతన బ్యాచ్ శిక్షణా తరగతులను సోమవారం ప్రారంభించారు.

క్రీడాసంబరం.. నృత్యోత్సాహం

- నన్నయలో సందడే సందడి
- హోరాహోరీగా క్రీడా పోటీలు
- ఉల్లాసంగా సాంస్కృతిక ప్రదర్శనలు





వెయిట్ లిఫ్టింగ్‌లో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

రాజానగరం: పగలంతా ఆటల్లో తమ తమ సత్తాను చాటి విజేతలుగా నిలిచేందుకు పోరాడుతున్న క్రీడాకారులు.. సాయంత్రం వేళలో సాంస్కృతిక ప్రదర్శనలలో కూడా పోటీపడుతున్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో మూడు రోజులుగా క్రీడోత్సాహం వెల్లువిరుస్తోంది. నాలుగు రోజుల పాటు జరిగే సౌత్ అండ్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ 2023–24 పోటీలు యూనివర్సిటీలోని మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియంలో శనివారం ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, గోవా రాష్ట్రాలలోని 90 యూనివర్సిటీల నుంచి సుమారు 800 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరంతా పోటీలలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పోటీల సమయం ముగిసిన నన్నయ ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో పలు రకాల సాంస్కృతిక ప్రదర్శనలిస్తూ సందడి చేస్తున్నారు.

పోటీల్లో విజేతలు వీరే..

శని, ఆదివారాలలో 10 కేటగిరీలలో జరిగిన పోటీలలో విజేతలకు వీసీ ఆచార్య కె.పద్మరాజు బహుమతులు అందజేశారు. ఇక మూడోరోజైన సోమవారం పురుషులకు 73, 81, 89 కిలోల కేటగిరీలోను, మహిళలకు 64, 71, 76, 81, 87 కిలోల కేటగిరీలోను పోటీలు నిర్వహించారు. పురుషుల 73 కిలోల కేటగిరీలో ఆర్.శివలింగేశ్వరసాయి (మహాత్మాగాంధీ యూనివర్సిటీ), మనోబాల (తిరువళ్లూర్ యూనివర్సిటీ), వదర్ మహాదేవ్ (సావిత్రీభాయ్ పూలే, పూణే) వరుసగా మూడు స్థానాలలో నిలిచారు.

▸▸ 81 కిలోల కేటగిరీలో స్కిషన్ పాల్ (యూనివర్సిటీ ఆఫ్ కేలికట్), ఎస్. కృష్ణభారతి (ఎస్ఆర్ఎం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ), కేవీ శ్రీరామ్ (ఆచార్య నాగార్జున యూనివర్సిటీ), 89 కిలోల కేటగిరీలో జానీస్ అబ్బాస్ (కానూర్ యూనివర్సిటీ), దిసాలి అభిజిత్ అంకుష్ (సావిత్రీ భాయ్ పూలే యూనివర్సిటీ, పూణే), ఎ.దినేష్ (తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు.

▸▸ మహిళల 64 కిలోల కేటగిరీలో ఎస్.పల్లవి (ఆంధ్ర యూనివర్సిటీ), మంగళం గోత్రి కౌషిక ఎల్. (మంగుళూర్ యూనివర్సిటీ), ఎస్.మోహబూబ్‌చంద్ (యోగి వేమన యూనివర్సిటీ), 71 కిలోల కేటగిరీలో ఎం.అనూష (కాకతీయ యూనివర్సిటీ), బి.నాని (ఆచార్య నాగార్జున యూనివర్సిటీ), సలున్క ప్రజక్త మధుకర్ (శివాజీ యూనివర్సిటీ–కొల్హాపూర్) ప్రతిభ చూపారు.

▸▸ 76 కిలోల కేటగిరీలో మానేతృప్తి సంజై (సావిత్రీబాయి పూలే యూనివర్సిటీ), వి.సావిత్రీ (కాకతీయ యూనివర్సిటీ), మంగళ గంగోత్రి యశశ్విని బండారి (మంగుళూర్ యూనివర్సిటీ), 81 కిలోల కేటగిరీలో సీహెచ్. శ్రీలక్ష్మి (ఆంధ్ర యూనివర్సిటీ), అంజన శ్రీజిత్ (యూనివర్సిటీ ఆఫ్ కోలికట్), పవర్ వైష్ణవి సంతోష్ (సావిత్రీబాయ్ పూలే యూనివర్సిటీ), 87 కిలోల కేటగిరీలో కేదర్ యోగిత జగన్నాథ్ (సావిత్రీబాయి పూలే యూనివర్సిటీ), ప్రతిభాకుమారి (యూనివర్సిటీ ఆఫ్ కాలికట్), వై. చైత్నకుమారి (ఆంధ్ర యూనివర్సిటీ) మూడు స్థానాల్లో నిలిచారు.





ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

దివ్యాంగ విద్యార్థులకు చేయూత



బిక్కవోలులో దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లను అందిస్తున్న అధికారులు

బిక్కవోలు: దివ్యాంగులైన విద్యార్థులకు మరింత చేయూత అందించాలని ఎంపీడీవో జేపీ ఝాన్సీ అన్నారు. సోమవారం ప్రపంచ దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా బిక్కవోలు భవిత కేంద్రం వద్ద బహుమతి నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ పోసిబాబు మాట్లాడుతూ జీవితంలో ఎదిగేందుకు అంగవైకల్యం అడ్డు కాదని, ఏదైనా సాధించగలమనే నమ్మకం కల్పించి ఆత్మ స్థైర్యం నింపేలా చేయాలని ఉపాధ్యాయులు కోరారు. అనంతరం సర్వశిక్ష ఆధ్వర్యంలో ఇచ్చిన ఐదుగురు విద్యార్థులు ట్యాబ్‌లను, వివిధ పోటీలు విజేతలకు బహుమతులను అందించారు. అనంతరం చిన్నారులకు పండ్లు, మిఠాయిలు అందించారు. ఎంఈవో – 1 సీహెచ్ వివి సత్యనారాయణ, ఎంఈవో 2 కె.పూర్ణచంద్రరావు, ప్రత్యేక ఉపాధ్యాయులు డి.సన్యాసిరావు, ఎస్.శివాజీ పాల్గొన్నారు.

జగన్ పాలనలో అర్హులందరికీ లబ్ధి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- రఘుదేవపురంలో గడప గడపకూ..



రఘుదేవపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని రఘుదేవపురంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. ముందుగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఎస్సీ కాలనీలో చర్చిని సందర్శించి ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య దళారీ వ్యవస్థ లేదన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్క పేదవారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి.. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. జనసేన పార్టీ నాయకులకు ప్రజలు కష్టాలు, బాధలు తెలియవన్నారు. రఘుదేవపురంలో రూ.8 కోట్లతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, పట్టపగల విష్ణుప్రసాద్, దాసరి బాబీ, పాలచర్ల అచ్యుత రామారావు, గెద్దాడ త్రిమూర్తులు, పైడి రాజు, నిడదవోలు శ్రీనివాస్, యలమాటి కాశీ, వడ్డుకూరి పుల్లయ్య, మల్లేశ్వరరావు, చంద్రు శ్రీను, పిండి రాధాకృష్ణ, సుంకర సూర్యచంద్రం పాల్గొన్నారు.

నకిలీ పట్టాదారులపై చర్యలు తీసుకోండి



జేసీ భరత్‌తేజ్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు వీరబాబు, లబ్ధిదారులు

గోకవరం: గోకవరం ఇందిరమ్మ మోడల్ కాలనీలో ఖాళీ స్థలాలను నకిలీ పట్టాలతో ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు పలువురు లబ్ధిదారులతో కలసి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరంలోకి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో జేసీకి వినతి పత్రం అందజేశారు. గతంలో తమకు స్థలాలు కేటాయించగా పలు కారణాలతో ఇళ్లు నిర్మించుకోలేకపోయామని, వాటిని కొందరు ఆక్రమించుకుని నకిలీ పట్టాలు సృష్టించి తమపై దౌర్జన్యం చేస్తున్నారని లబ్ధిదారులు వాపోయారు.

సంక్షేమ పథకాలతో జీవన ప్రమాణాలు మెరుగు

- ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- అనపర్తి మార్కండేయపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

అనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి గ్రామ సచివాలయం–2 పరిధిలో గల మార్కండేయపురంలో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే ప్రజా సమస్యలు తెలుసుకుంటూ, అర్హత కలిగి సంక్షేమ ఫలాలు అందనివారు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన ప్రయోజనాన్ని వివరిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూర్చుతూ అండగా నిలుస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో గడప గడపకూ నిర్వహిస్తున్న ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎస్ఎస్, వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఎంపీటీసీ సభ్యులు బండారు శ్రీను, కొండేటి భీమేష్, సత్తి దొరయ్యరెడ్డి, పార్టీ నాయకులు పడాల శ్రీనివాసరెడ్డి, నూనె రంగారావు, ర్యాలికృష్ణ, ఎక్కలదేవి శ్రీను, మల్లిడి గోవిందరెడ్డి పాల్గొన్నారు.



అనపర్తి మార్కండేయపురంలో గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

ఆధునిక, సాంకేతికతపై రైతులకు అవగాహన



పెదరాయవరంలో చిత్రపటం ద్వారా వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

రంగంపేట: నూతన వంగడాలు ఏ విధంగా వినియోగించాలో అవగాహన కల్పించడంలో వ్యవసాయ విద్యాభ్యాసన విద్యార్థులు చైతన్య వంతులు కావాలని జిల్లా వ్యవసాయ సలహా, సాంకేతిక కేంద్రాల శాస్త్రవేత్తలు డాక్టర్ అచ్యుతరాజు, డాక్టర్ నందకిషోర్ సూచించారు. మండల పరిధిలోని పెదరాయవరం గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. బాపట్ల ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయ విద్యార్థులు కస్తూరి లహరి, బి. లీనామాధురి, పి.హనీశ్రీ, ఐ. హిమజ రైతులకు వ్యవసాయ అభివృద్ధి పనులు, ఆధునిక వంగడాలు, ఎరువులు, పురుగు మందులు కొనడంలోను, వినియోగంలోను తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం వ్యవసాయ అభివృద్ధి పనులు, పంటల విస్తీర్ణం, వరి, మినుము, పెసర తదితర పంటల సేద్యంపై రైతులు ఏ విధంగా కృషి చేస్తున్నారో సమాచారాన్ని సేకరించారు. అగ్రకల్చర్ అసిస్టెంట్ సతీష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన శివాలయాలు

గోకవరం: పవిత్ర కార్తిక మాసంలో చివరి సోమవారాన్ని పురస్కరించుకుని గోకవరం మండలంలో శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. గోకవరంలో పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. స్థానిక రమా సత్యనారాయణ స్వామివారి ఆలయంలో కొలువైన ఉమా సమేత గోకర్ణేశ్వరస్వామివారి ఆలయానికి విశేష సంఖ్యలో భక్తులు వచ్చారు. కొత్తపల్లిలో రెడ్డిరాజుల కాలం నాటి బాలాత్రిపుర సుందరీ సమేత రాజలింగేశ్వర స్వామివారి ఆలయానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. గోకవరం మురళీనగర్‌లోని సాయిబాబా ఆలయంలో కొలువైన సోమేశ్వరస్వామి, తంటికొండలో అఖిలాండేశ్వరీ సమేత జంభుకేశ్వరస్వామి వారి ఆలయం, కృష్ణునిపాలెంలోని పార్వతీ సమేత విశ్వేశ్వరస్వామి వారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి.

అనపర్తి: పాతవూరు శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామి, అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక మార్కండేయపురంలో వేంచేసి ఉన్న శ్రీ భావనాఋషి సమేత భద్రావతి సమేత దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు ఎ.రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. స్థానిక పాతవూరు నల్లకాలువ రేవు ఒడ్డున గల అభీష్టలింగేశ్వరునికి భక్తులు స్వయంగా అభిషేక పూజలు జరిపారు.

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి రుద్రాభిషేకం, లక్ష పత్రి పూజ, హోమం, స్వామి,అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త క్రొవ్విడి సర్రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. క్రొవ్విడి సర్రాజు, సూరిపండు ఆధ్వర్యంలో 11 రకాల ద్రవ్యాలతో స్వామికి అభిషేకాలు జరిగాయి. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. బూరుగుపూడి, గుమ్ములూరు. బుచ్చెంపేట, దోసకాయలపల్లి, నిడిగట్ల తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, వ్యవసాయ సలహామండలి జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్‌తేజ, విశ్రాంత వీఆర్వో ఏవీఎస్ఎన్ మూర్తి, బూరుగుపూడి పీఏసీఎస్ చైర్‌పర్సన్ బుడ్డిగ సత్తిబాబు పాల్గొన్నారు.



బూరుగుపూడిలో అభిషేకం చేస్తున్న అర్చకులు

సీతానగరం: కార్తిక సోమవారం సందర్భంగా మండలంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సీతానగరంలోని ఉమారామలింగేశ్వరస్వామి, ముగ్గళ్లలోని ఉమా కొమరేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. రఘుదేవపురం, కాటవరం, మునికూడలి, కూనవరాల్లోని శివాలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పురుషోత్తపట్నం ఏఎంసీ విద్యాసంస్థల అధినేత కల్లూరి రామకృష్ణ పరమహంస, గీతా దంపతులు నెలకొల్పిన గణపతి ఆలయంలో పరమశివుడికి ఏకాదశి రుద్రాభిషేకం, లక్ష పత్రి పూజ నిర్వహించారు.

రాజానగరం: నియోజకవర్గంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం వేళలో పలువురు భక్తులు ముఖ్యంగా మహిళలు ఈశ్వరుని సన్నిధిలో దీపోత్సవం నిర్వహించారు. రాజానగరంలోని రాజగోపాలస్వామి, రాజలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఓంకారం, స్వస్తిక్, శివలింగం తదితర ఆకారాలలో వెలిగించిన దీపాలు ఆకట్టుకున్నాయి.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



తిరుమలాయపాలెంలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. తిరుమలాయపాలెం గ్రామంలో సోమవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. స్థానిక సచివాలయంలో సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారుల వివరాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో ప్రసిద్ధి గాంచిన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే దారిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, ఉప సర్పంచ్ దుర్గాప్రసాద్, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, నాయకులు నరాలశెట్టి నర్సయ్య, ఎంపీడీఓ పద్మాజ్యోతి, ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, కార్యదర్శి గోవిందు పాల్గొన్నారు.



ఊలపల్లిలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న నాయకులు

జగనన్న పాలనలోనే..సంక్షేమం, అభివృద్ధి

బిక్కవోలు: జగనన్న పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు అన్నారు. సోమవారం మండలంలోని ఊలపల్లి గ్రామంలోని సచివాలయం–2 వద్ద ఆంధ్రాకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు వివరించారు. సంక్షేమ పథకాల బోర్డులను, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, దీంతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. రాష్ట్రానికి నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి ఎందుకు కావాలో తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బండారు శివ పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే ముఖ్యమంత్రి లక్ష్యం

పెదపూడి: అర్హతగల ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఆ కుటుంబలో వెలుగులు నింపుతూ ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా కృషి చేస్తున్న నేత ముఖ్యమంత్రి జగన్ అని పలువురు వక్తలు కొనియాడారు. దోమాడ గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నోడల్ ఆఫీసర్ ఎం.సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో జనరంజకపాలన సాగుతోందని వక్తలు తెలిపారు. ఈ సందర్భంగా ఏ పథకాలతో ఎంత మంది లబ్ధి పొందారో వివరాలు తెలియజేసే సంక్షేమ అభివృద్ధి పథకాల బోర్డును సచివాలయం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించి ప్రజలకు గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మీనవల్లి శారదాదేవి, ఉప సర్పంచ్ గుడాల అనంతలక్ష్మి, సచివాలయ కార్యదర్శి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



దోమాడలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కేంద్ర పథకాలపై అవగాహన

రాజానగరం: మండలంలోని జి.యర్రంపాలెం, కొండగుంటూరులో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారంపై అవగాహన కలిగిస్తూ స్టాల్స్ ఏర్పాటు, విద్యాశాఖ ద్వారా అక్షరాస్యతా కార్యక్రమాలు నిర్వహించారు. లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. తొలుత ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సందేశాన్ని వినిపిస్తూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈఓపీఆర్డీ వి.శ్రీరామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శులు గంగాధర్, ప్రసాద్, ఐసీడీఎస్ సీడీపీఓ టి.నాగమణి పాల్గొన్నారు. ప్రణాళికల రూపకల్పన, దేశాభివృద్ధిలో యువతను భాగస్వాములు చేయాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య కేఎస్ రమేష్ అన్నారు. యూనివర్సిటీలో అధ్యాపకులు, విద్యార్థులతో వికసిత్ భారత్ 2047పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ ఆచార్య వై. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి, డాక్టర్ పి. విజయనిర్మల, డాక్టర్ పి.వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

పెదపూడి: పేదల అభివృద్ధి, సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై గ్రామాల్లో ప్రజలకు తప్పని సరిగా అవగాహన ఉండాలని ఎంపీడీఓ వీవీ సాయిబాబు తెలిపారు. రామేశ్వరం, ఏపీ త్రయం గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప ప్రచార యాత్ర నిర్వహించారు. రామేశ్వరంలో సర్పంచ్ కొటికలపూడి చినబాబుకు సాయిబాబు, పంచాయతీ కార్యదర్శి అచ్చిరాజు కలశాన్ని అందజేసి ర్యాలీ ప్రారంభించారు. సాయిబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందించడానికి, వాటిపై అవగాహన కల్పించడానికి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. తహసీల్దార్ టి.సుభాష్, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సొసైటీ చైర్మన్ గుండా ఈశ్వరరావు, సర్పంచ్ అడబాల అనురాధ, రామేశ్వరం ఉప సర్పంచ్ వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

శాంతి దూత ఏసుక్రీస్తు



రాజానగరంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: ప్రపంచ శాంతి దూత ఏసుక్రీస్తు అని, ఆయన బోధనలు సమైక్యతకు, సమగ్రతకు మార్గదర్శకాలని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో రాజానగరంలో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకలలో ఆమె పాల్గొన్నారు. సంఘీయుల కోరిన కమ్యూనిటీ హాలు విషయాన్ని ప్రస్తావిస్తూ స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దృష్టికి తీసుకువెళ్తానని ఆమె తెలిపారు.